## క్లుప్తంగా

### 2న చలో కలెక్టరేట్

**జన్నారం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, నిత్యావసర ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కలిందర్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యుడు పొలు, నాయకులు మహేందర్‌రెడ్డి, విజయ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా రుణమాఫీ సర్వే



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

**జన్నారం:** రేషన్ కార్డు లేక రైతు రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదు సర్వే కొనసాగుతోంది. అధికారులు, సిబ్బంది ఇంటింటి కి వెళ్లి సర్వే చేస్తున్నారు. లేవలేని స్థితిలో ఉన్న రైతుల ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. నేరుగా యాప్‌లో వారి ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. శనివారం మండలంలోని కలమడుగు గ్రామంలో మంచం నుంచి లేవలేని స్థితిలో ఉన్న రైతుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించినట్లు ఏవో సంగీత, ఏఈవో దివ్య తెలిపారు.

### దొడపల్లిలో నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు

**లక్సెట్టిపేట:** మండలంలోని దొడపల్లి గ్రా మంలో గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిరాహార దీక్ష చేశారు. మండల కార్యదర్శి మే దరి దేవవరం మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం లేదని, పాఠశాలలో విద్యార్థులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలోని రేషన్ డీలర్ సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు. మండల నాయకులు కేతిరెడ్డి రమణారెడ్డి, దుర్గం దేవన్న, ఉదయ్ పాల్గొన్నారు.

### పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**మంచిర్యాలఅర్బన్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవురోజు ఆదివారం క్లాసులు నిర్వహించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. సెలవురోజున క్లాసులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, కార్యదర్శి తిరుపతి, సభ్యులు విష్ణు, రమేశ్‌లు పాల్గొన్నారు.

### తాగునీటి సౌకర్యం కల్పించాలి



కమిషనర్‌తో మాట్లాడుతున్న కాలనీవాసులు

**మందమర్రిరూరల్:** మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ జోన్ రామాలయం ఏరియా, 8వ వార్డులోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందిగా ఉందని వెంటనే నీటి సౌకర్యం కల్పించాలని శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ కాలనీలో ఇంతవరకు మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదని, ఇది వరకు ఉన్న పైపులైన్ మురికి కాలువతో నిండిపోయి మురికి నీరు సరఫరా అవుతుందని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే పైపులైన్ వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కాలనీవాసులు శ్రీనివాస్, కొమురయ్య, మహేందర్, రాజయ్య ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

**బెల్లంపల్లిరూరల్(తాండూర్):** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని స్టేషన్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి సరిపడా సరుకులు వస్తున్నాయా, నాణ్యమైన సరుకులు అందుతున్నాయా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితను అడిగి తెలుసుకున్నారు.

# ఇసుక మాఫియా హల్‌చల్



చర్లపల్లి శివారు పత్తి చేనులో ఇసుక కోసం జరిపిన తవ్వకాలు

- పత్తి చేలు, వాగుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- ఒక్కో ట్రాక్టర్‌లోడ్‌కు రూ.5వేలు వసూలు
- పట్టించుకోని అధికారులు

**బెల్లంపల్లి:** ఇసుక దొంగలు పేట్రేగిపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాగులు, వంకల్లో మేటలు వేసిన ఇసుకను దోచుకెళ్తున్నారు. రైతులు పంటలు సాగు చేస్తున్న పత్తి చేలు, బీడు భూముల్లోంచి ఇసుక రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు, కుంటల వద్ద మేటలు వేసిన ఇసుకను సైతం అడ్డూఅదుపు లేకుండా తరలిస్తున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నెన్నెల మండలం ఖర్జీ ఇసుక రీచ్‌ను ప్రస్తుతం నిర్వహించడం లేదు. వర్షాల కారణంగా రీచ్‌లో దాదాపు 45 రోజుల పైబడి ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దీంతో తీవ్రమైన ఇసుక కొరత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. బెల్లంపల్లి మండలంలోని చర్లపల్లి, చంద్రవెల్లి, చాకేపల్లి, కన్నాల, ఆకెనపల్లి, బట్వాన్‌పల్లి, దుగినేపల్లి, పెర్కపల్లి తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లో అందినకాడికి ఇసుకను తోడుకెళ్లి అమ్ముకుంటున్నారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతాల నుంచి కూడా గుట్టుగా ఇసుకను తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**ట్రాక్టర్ లోడ్ రూ.5వేలు..**

నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లితో పాటు ఆయా గ్రామాల్లో భవన నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. పక్కాగృహాలు, వ్యాపార సముదాయాలు ఇతర శాశ్వత కట్టడాల నిర్మాణాలు చేస్తున్నారు. వీటి నిర్మాణానికి అవసరమైన ఇసుకకు బాగా డిమాండ్ ఏర్పడింది. ఖర్జీ రీచ్ నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు ట్రాక్టర్ లోడ్ ఇసుకను రూ.3 వేల చొప్పున విక్రయిస్తుండగా, వాగులు, చేలల్లో నుంచి దొంగచాటుగా తరలిస్తున్న ఇసుకను రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

**నిద్రపోతున్న నిఘా..**

వాగులు, వంకలు, పంట చేలు, బీడు భూములు, చెరువులు, కుంటల్లో నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదని తెలుస్తోంది. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించాల్సి ఉండగా, అలాంటి చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ట్రాక్టర్ల యజమానులు కొందరు అధికారులతో లోపాయికారిగా ఒప్పందం చేసుకుని అక్రమ దందా సాగిస్తున్నట్లు గుసగుసలు ఉన్నాయి.

**అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం**



పంట చేలు, బీడు భూములు, వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమంగా తీసుకురావడం నేరం. రైతులు ఏర్పాటు చేసుకున్న చెరువులు, కుంటల నుంచి కూడా ఇసుక తోడొద్దు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రోజువారీగా నిఘా పెట్టి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తాం.

– జ్యోత్స్న, తహసీల్దార్, బెల్లంపల్లి

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉపనిష ధ్వని

**మంచిర్యాలక్రైం:** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తులు ఉపనిష ధ్వని, నిరోషాలు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక చర్యలపై అవగాహన కల్పించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు జరుగుతున్న లింగ వివక్షత, వాటి నివారణ చర్యలు చట్టపరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తగు న్యాయ సలహాలు తెలుసుకోవాలన్నారు. సంఘ సేవకురాలు శాంకరి, సువర్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు, ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల మహిళలు పాల్గొన్నారు.

## డిజిటల్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న డీఈవో

**దండేపల్లి:** డిజిటల్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, డీఈవో యాదయ్య అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో శనివారం డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ బోధనతో విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమవుతాయన్నారు. పాఠశాల అభివృద్ధికి బడిబాగులో నేను అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, దాతలు, గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తున్న హెచ్ఎం బుచ్చన్నను అభినందించారు. పాఠశాలలో వంద శాతం హాజరు కలిగి ఉన్న సహశ్రీ, లాస్యలను డీఈవో సత్కరించారు. ఉపాధ్యాయురాలు కల్పన, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, విశ్రాంత హెచ్ఎంలు సత్యనారాయణ, సత్తయ్య, అల్లీపూర్ జీపీ సెక్రటరీ శ్రీహరి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కార్మికులకు సన్మానం



శ్రీరాంపూర్: కార్మికులను సన్మానిస్తున్న మేనేజర్

**శ్రీరాంపూర్:** సర్వీసు పూర్తి చేసి రిటైర్మెంట్ పొందిన కార్మికులను యాజమాన్యం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. శనివారం ఆర్కే 6గనిపై రిటైర్డ్ అయిన వెంకట పుల్లారెడ్డి పంప్ ఆపరేటర్, అన్నబోయిన అర్జయ్య హాలేజ్ ఆపరేటర్లను గని మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించారు. గని డిప్యూటీ మేనేజర్ శ్యాంకుమార్, ఇంజనీర్ సహదేవ్ వర్మ, సర్వే అధికారి రంజిత్ కుమార్, సీనియర్ అండర్ మేనేజర్ శ్రీనివాస్, సెక్రెటరీ సంఘం సదానందం, సమ్మయ్య, రామచందర్, మహేశ్, నగేశ్ పాల్గొన్నారు.

- ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో సీహెచ్‌పీలో రిటైర్డ్ కార్మికుడు దామోదర్‌కు ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.
- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్కే 7 గనిలో రిటైర్డ్ అయిన సంకటి రాజయ్య, సమ్మిరెడ్డి, మిట్టపల్లి శంకర్‌లను ఘనంగా సన్మానించారు. యూనియన్ నాయకులు రాజునాయక్, మల్లేశ్, శ్రీనివాస్, తిరుపతి, గురుమూర్తి, సుబాని పాల్గొన్నారు.
- ఆర్కే న్యూటెక్ గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. యూనియన్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీధర్, విజయ్, రవీందర్ పాల్గొన్నారు.

**బెల్లంపల్లిలో..**

**బెల్లంపల్లి:** మందమర్రి ఏరియా శాంతిఖని గనికి చెందిన ట్రామర్ ఏవునూరి లక్ష్మయ్య అనే రిటైర్డు కార్మికుడిని శనివారం గని ఆవరణలో పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అధికారులు, కార్మిక సంఘాల శ్రేణులు, బంధువులు లక్ష్మయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. గని యాక్టింగ్ మేనేజర్ పి.రాజు, బీఎం ఇన్‌చార్జి ముస్తాఫా, అండర్ మేనేజర్ నాగవర్ధన్, జూనియర్ సర్వే అధికారి యు.రమేశ్, గని సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అబ్బాపూర్ ఓపెన్‌కాస్ట్‌లో..**

**బెల్లంపల్లిరూరల్(తాండూర్):** బెల్లంపల్లి ఏరియా అబ్బాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఆకుల సత్యనారాయణను శనివారం సన్మానించారు. సత్యనారాయణ దంపతులను వృత్తి గనుల శిక్షణ మేనేజర్ విజయ్ సింగ్ పూలమాలలు, శాలువాతో సన్మానించారు. గని ఉపశిక్షణ అధికారి రమేశ్, హెడ్ ఓవర్‌మెన్ శ్రీనివాసరావు, సిబ్బంది పార్వతి, మారుబాయి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): కామేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉన్నతాధికారులు



బెల్లంపల్లి: గోపాల్ దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** ఉద్యోగ విరమణ పొందుతున్న పంచాయతీరాజ్ ఏఈ కామేశ్వర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. శనివారం మంచిర్యాల పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ రాజ్ జిల్లా ఈఈఈ ఎం.స్వామిరెడ్డి, డీఈఈలు బి.హరీశ్, రవీందర్‌రాథోడ్, సంతోష్, సుబ్బారెడ్డి, సురేశ్, పి.శ్రీధర్, విశ్రాంత ఈఈ మధునయ్య, హాజీపూర్ ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఏఈఈలు, జేఈఈలు, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడికి సన్మానం**

**భీమిని:** కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు తోకల రాజేశంను శనివారం ముత్తాపూర్ గ్రామస్తులు, యువకులు సన్మానించారు. గత 9 సంవత్సరాలుగా ముత్తాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్మీడియెట్ కార్యాలయంలో..**

**మంచిర్యాలఅగ్రికల్చర్:** సమీకృత కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో పర్యవేక్షులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కడకుంట్ల శ్రీనివాస్ దంపతులను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కటకం అంజయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు లక్ష్మణ్‌రావు, శంకర్, అంజయ్య, స్వరూప, నాగచందర్‌రావు, శోభ, శ్రీనివాస్‌రావు, రాజయ్య, శ్రీనివాస్, జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు..**

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్, పూర్వ ప్రిన్సిపాల్ ఎం.గోపాల్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోపాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాళ్లు కాంపల్లి శంకర్, చక్రపాణి, పట్వర్ధన్, సంతోష్, కనకయ్య, శ్రీదేవి, జైకిషన్, ఓజా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంకుశంలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**బెల్లంపల్లిరూరల్:** బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామంలో తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురు జ్వరాల బారిన పడడంతో పీహెచ్‌సీ వైద్యురాలు ఎవంజలీన్ రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి ప్రభాకర్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ మల్లిక, ఏఎన్ఎం దేవమణి, హెల్త్ అసిస్టెంట్ శివ గణేశ్వర్‌రావు, సిబ్బంది సుమలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**

**దండేపల్లి:** మండలంలోని లింగాపూర్‌కు చెందిన సోగాల శ్రీనివాస్, ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం బాధిత కుటుంబానికి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుభాష్, లక్ష్మణ్, జమీర్, కొమురయ్య, స్వామి, ఇమామ్, కాంతారావు, రాములు పాల్గొన్నారు.

**కుట్టు మిషన్‌లు, సైకిళ్లు పంపిణీ**



కుట్టుమిషన్లు, సైకిళ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

**కాసిపేట:** మండలంలోని దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లయన్ గొంది లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో గట్రావ్‌పల్లికి చెందిన ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్‌లు, దేవాపూర్ ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులు ఇద్దరికి సైకిళ్లు అందజేశారు. పేదలకు సాయం చేసేందుకు సహకరించిన జిల్లా గవర్నర్ జేఎంటీ కో ఆర్డినేటర్‌కు, ఆర్‌సీ రాజయ్యకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్‌సీఐఎఫ్ కో ఆర్డినేటర్ గొంది వెంకటరమణ, క్లబ్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, సెక్రెటరీ సు నీతదేవి శర్మ, లయన్స్ మడావి వెంకటేశ్, విక్రమ్‌రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**దుప్పట్లు పంపిణీ**

**కోటపల్లి:** మండలకేంద్రంలో సీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనకంటి కపిల్‌కుమార్ నిరుపేదలకు దు ప్పట్లు పంపిణీ చేశారు. మల్లయ్య, శ్యాంసుందర్, విజయ్, రాగంస్వామి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి



మందమర్రిరూరల్: మాట్లాడుతున్న రమేశ్



చెన్నూర్: మాట్లాడుతున్న నాయకులు

**మందమర్రిరూరల్:** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ కన్వీనర్ అక్కల రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సారంగపల్లి, చిర్రకుంట గ్రామ పంచాయతీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి రమేశ్, నాయకులు దీక్షితులు, అరుముల్ల పోశం, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

**బీజేపీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**చెన్నూర్:** ప్రజల్లోకి బీజేపీ సిద్ధాంతాలను తీసుకెళ్లి చెన్నూర్‌కు నిర్దేశించిన సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీపాల్, సమ్మయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

## మున్సిపల్ అత్యవసర సమావేశం

- పలు తీర్మానాలు చేసిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

**మంచిర్యాలక్రైం:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 15 ఏజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణ, వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ వీధి దీపాల నిర్వహణ చేపట్టాలని, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున బ్లీచింగ్, ఇతర అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- మున్సిపల్ సాధారణ నిధులతో పట్టణంలో రూ.67.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.
- మంచిర్యాల పట్టణంలోని వివిధ ఏరియాల్లో ఎలక్ట్రికల్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు తరలించేందుకు అయ్యే అంచనా వ్యయం రూ. 6.45లక్షలు ఎన్‌పీడీసీఎల్, మంచిర్యాల ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు.
- వివిధ దినపత్రికలలో ప్రచురించిన టెండర్ ప్రకటన బిల్లులు రూ.1,65,248 మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ సల్ల మహేశ్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజనీర్ ఎండీ మసూద్‌అలీ, టౌన్‌ప్లానింగ్ అధికారి సంపత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## వర్షానికి ఉరుస్తున్న హాస్టల్ భవనం



వర్షపునీరు గదిలో చేరకుండా బకెట్లు పెట్టిన విద్యార్థులు

- పట్టించుకోని అధికారులు

**చెన్నూర్:** పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు వర్షం కురిస్తే ఇబ్బందులు తప్పడం లేదు. ఇందిరానగర్ కాలనీలో గల ఎస్సీ హాస్టల్‌లో 25 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు భవనంలోని మూడు గదుల పైకప్పులు పగుళ్లు తేలి వర్షానికి ఉరుస్తున్నాయి. విద్యార్థులు శనివారం వర్షం నీరు గదిలో చేరకుండా ఉరుస్తున్న చోట బకెట్లు పెట్టి నీటిని బయట పారబోశారు.

**ఇరుకు గదులు..**

వసతి గృహంలో ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు ఇరుకు గదిలో ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ గదులలో సౌకర్యాలు లేక చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని వారు వాపోతున్నారు. కాగా హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ కూడా లేరు. భీమారం హాస్టల్ వార్డెన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. వార్డెన్ హాస్టల్‌కు అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. హాస్టల్ పరిసరాలలో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతుందని, వసతి గృహానికి మెయిన్ గేట్‌కు డోర్ లేకపోవడంతో రాత్రి వేళల్లో పందులు, పశువులు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## మోడల్‌స్కూల్, కేజీబీవీ సందర్శన

**కాసిపేట:** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ, కేజీబీవీలను శనివారం ఎల్ఐపీలో భాగంగా మండల నోడల్ అధికారి రమేశ్ రాథోడ్ సందర్శించారు. క్లాస్‌రూమ్‌లో బోధనతీరును పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు 10/10 జీపీఏ సాధించేందుకు, వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు, బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి బేసిక్ క్లాస్‌లను నిర్వహించాలన్నారు. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగమల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపీఎస్ విధానం అమలు చేయాలని నిరసన



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

**బెల్లంపల్లి:** ఉద్యోగులకు ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘీక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల విద్యాలయం ఉద్యోగులు నిరసన తెలిపారు. విధులకు హాజరైన ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గురుకుల విద్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిలబడి నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఓపీఎస్ విధానం పునఃరుద్ధరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు.